Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

స్పాట్ ఎడిషన్

epaper.telanganaveena.com హైదరాబాద్ శుక్రవారం 21.02.2025

## రుణమాఫీ కాలేదంటూ గాంధీ భవన్ మెట్ల మీద వృద్ధ రైతు ధర్నా



తెలంగాణవీణ, హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్ రెడ్డి మాటలు.. నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో.. రేవంత్ సర్కార్‌పై ఆగ్రహంతో ఉన్నారు. అవకాశం ఉన్న చోట రైతులు నిరసన తెలుపుతున్నారు. తాజాగా ఓ వృద్ధ రైతు.. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు చేరుకుని ధర్నాకు దిగాడు. తనకు రుణమాఫీ చేసే వరకు ఇక్కడ్నుంచి కదిలేది లేదని ఆ రైతు తేల్చిచెప్పాడు. తన పేరు తోట యాదగిరి శాలిగౌరారం మండలం తుంగతుర్తి నియోజకవర్గం.. 55 క్వింటాళ్ల 80 కిలోల ధాన్యాన్ని విక్రయించాను. కానీ ఇప్పటి వరకు బోనస్ రాలేదు. అంతే కాదు రుణమాఫీ కూడా కాలేదు.. ఇటు పెన్షన్లు లేవు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి 2 లక్షల రుణమాఫీ చేయాలి. ప్రభుత్వం దిగి వచ్చే వరకు నేను ఇక్కడ్నుంచి కదలను. నేను అబద్ధమాడితే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమే అని రైతు తోట యాదగిరి తేల్చిచెప్పాడు.


## రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు..

తెలంగాణవీణ,కొడంగల్

కొడంగల్ లోని పోలేపల్లి గ్రామం రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావు మరియు ఎమ్మెల్యేలు



## 24 గంటలూ షాపులు తెరవచ్చు.. ప్రభుత్వం కీలక ఉత్తర్వులు



తెలంగాణవీణ, హైదరాబాద్

రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్రంలో మార్చి 2 నుంచి 31 వరకు షాపులను 24 గంటలూ తెరిచేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు కార్మికశాఖ ముఖ్య కార్య దర్శి సంజయ్కుమార్ ఉత్తర్వులిచ్చారు. సిబ్బంది రోజుకు 8 గంటలు లేదా వారానికి 48 గంటలకు మించి పనిచేస్తే యాజమాన్యం రెట్టింపు వేతనం చెల్లించాలని స్పష్టం చేశారు. సెలవుల్లో పనిచేస్తే ప్రత్యామ్నాయ లీవ్ ఇవ్వాలన్నారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం

## అప్పకపల్లెలో శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణవీణ, అప్పకపల్లె

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇవాళ వికారాబాద్, నారాయణపేట పర్యటనకు వెళ్లిన సీఎం, అప్పకపల్లెలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులు ప్రారంభించారు. అప్పక్ పల్లిలో బంగలి దేవమ్మ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, సీఎం సలహాదారు వెం నరేందర్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అంతకుముందు అప్పకపల్లెలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంకు ప్రారంభించారు. అనంతరం అక్కడి మహిళలతో సీఎం, మంత్రులు ముచ్చటించారు.



## కాంగ్రెస్ కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల్లోనే సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయంగా తొలి ఎదురుదెబ్బ తగిలింది. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఇది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మార్పులకు దారితీయనున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పాఠశాలకు వెళ్తూ దారిలో కుప్పకూలిన టెన్త్ విద్యార్థిని

ప్రస్తుతం మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలికి వయసుతో సంబంధం లేకుండానే గుండెపోటు విజృంభిస్తోంది. బడికి వెళ్లే పిల్లలు కూడా హార్ట్‌ఎటాక్ బారిన పడుతున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లాలో పదో విద్యార్థిని గుండెపోటుతో మరణించింది. పాఠశాల యాజమాన్యం స్పందించి సీపీఆర్ చేసి ఆసుపత్రికి తీసుకెళ్లిన సరే ఆమెను బతికించలేకపోయారు. దీంతో ఆ బాలిక కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.పాఠశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం, కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం సింగరాయిపల్లికి చెందిన విద్యార్థిని చదువు నిమిత్తం కామారెడ్డిలోని కల్కినగర్‌లో ఉంటుంది. తన పెద్దనాన్న ఇంట్లో ఉంటూ ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఎప్పుడూ వెళ్లినట్లే గురువారం ఉదయం పాఠశాలకు బయలుదేరింది. కాలినడకన వస్తూ పాఠశాలకు సమీపంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.ఈ విషయం గుర్తించిన తోటి విద్యార్థులు పాఠశాల యాజమాన్యానికి తెలపడంతో వారు వెంటనే అక్కడికి చేరుకొని విద్యార్థినిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారు సీపీఆర్ చేసి రక్షించే ప్రయత్నం చేశారు. పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య చికిత్స అందిస్తుండగా ప్రాణాలు కోల్పోయిందని ఆసుపత్రి వైద్యులు, పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఈ ఘటన కుటుంబ సభ్యులకు తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.

## మహారాష్ట్ర సైబర్ సెల్ ముందు హాజరు కావాలని రాఖీకి నోటీసులు



యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా 'ఇండియాస్ గాట్ లాటెంట్' కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఆయనపై పలు కేసులు కూడా నమోదయ్యాయి. తాజాగా ఇదే కేసులో బాలీవుడ్ నటి రాఖీ సావంత్ కు మహారాష్ట్ర సైబర్ సెల్ సమన్లు జారీ చేసింది. స్టేట్మెంట్ రికార్డ్ చేయడానికి ఈనెల 27న మహారాష్ట్ర సైబర్ సెల్ ముందు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది.

'ఇండియాస్ గాట్ లాటెంట్' వివాదాస్పద ఎపిసోడ్ లో రాఖీ సావంత్ పాల్గొనకపోయినప్పటికీ... గతంలో నిర్వహించిన ఎపిసోడ్లకు ఆమె అతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా ఐజీ యశస్వి యాదవ్ మాట్లాడుతూ... షోలోని అన్ని ఎపిసోడ్ లలో పాల్గొన్న వారందరి పైనా ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయని... అందులో భాగంగానే రాఖీకి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు నటులు, నిర్మాతలు సహా మొత్తం 42 మందికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. రణవీర్ స్టేట్మెంట్ రికార్డ్ చేయడానికి ఫిబ్రవరి 24న తమ ముందు విచారణకు హాజరు కావాలని ఇప్పటికే ఆయనకు నోటీసులు ఇచ్చారు. కేసు వివరాల్లోకి వెళితే... ఈ షోలో పాల్గొన్న ఒక వ్యక్తిని తల్లిదండ్రుల శృంగారం గురించి రణవీర్ ప్రశ్నించాడు. దీంతో, ఆయనపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. పార్లమెంట్ సభ్యులు కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లో ఆయనపై ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయి. ఈ కేసులపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా... సర్వోన్నత న్యాయస్థానం ఆయనను తీవ్రంగా మందలించింది. ఇప్పటి వరకు నమోదైన కేసులపై విచారణ జరపాలని... కొత్తగా మరో కేసు నమోదు చేయవద్దని పోలీసులను ఆదేశించింది.

## అంజనాదేవి అస్వస్థతకు గురయ్యారనే వార్తల్లో నిజం లేదన్న చిరంజీవి టీమ్



తెలంగాణవీణ, హైదరాబాద్

మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవి అస్వస్థతకు గురయ్యారంటూ ఉదయం నుంచి వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ తెల్లవారుజామున ఆమెను హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. తల్లి అనారోగ్యం విషయం తెలిసి విజయవాడ నుంచి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నారని కూడా వార్తలు వచ్చాయి. పవన్ కల్యాణ్ విజయవాడలో ఈ రోజు కార్యక్రమాలను, అధికారులతో సమీక్షలను రద్దు చేసుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు అంజనాదేవి అస్వస్థతకు గురయ్యారనే వార్తలపై చిరంజీవి టీమ్ స్పందించింది. ఆ వార్తల్లో నిజం లేదని తెలిపింది. కేవలం సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగానే ఆమెను గత వారం ఆసుపత్రికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని వెల్లడించారు.